క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సరోజమ్మ

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన చిన్నారి వర్షిణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.80 వేల చెక్కును సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన రాజకల కుమార్తె వర్షిణికి ఏడాది క్రితం డెంగీ సోకగా కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి సర్పంచ్ సరోజమ్మ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరువతో మంజూరైన రూ. 80 వేల చెక్కును రాజకళకు సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మంత్రికి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియ ఆదివారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం




శ్రీనివాసులను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా టీవీ మెకానిక్‌ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులును టీవీ మెకానిక్‌లు, షాప్ యజమానులు ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఆధ్యాత్మిక, ప్రజా సేవా కార్యక్రమాలకు శ్రీనివాసులు చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించింది ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో టీవీ మెకానిక్‌లు, షాపుల యజమానులు ప్రసాద్, నాగరాజు.సంగీతంశీను, బాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ తండా గ్రామానికి చెందిన హేమ్లా నాయక్ భార్య దేవి బాయి అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక దేవి బాయి మృతి చెందింది. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు దేవిబాయి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎంపీపీ కాటసాని శివారెడ్డి వర్ధంతి



అన్నదానం చేస్తున్న కాటసాని మద్దిలేటమ్మ

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండ పై ఉన్న బ్రహ్మంగారి మఠం వద్ద ఆదివారం శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ఎంపీపీ కాటసాని శివారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాటసాని శివారెడ్డి సతీమణి కాటసాని మద్దిలేటమ్మ భక్తులకు, అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కమిటీ సభ్యులు కాటసాని పార్వతమ్మ, వెంకటేశ్వర్లు, నాగరాజు, రాజారెడ్డి, సుబ్బారాయుడు, వెంకట్రామిరెడ్డి, ఆలయ అర్చకులు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

లారీ అపహరణ

బేతంచెర్ల: తన లారీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని పట్టణానికి చెందిన గొల్ల తెల్ల మేకల మద్దిలేటి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆదివారం తెలిపారు. లారీని కర్నూలు రహదారిలోని ఎంఆర్ఎఫ్ టైర్ గోడన్‌కు ఎదురుగా శనివారం మధ్యాహ్నం నిలిపి ఉంచాడు. అక్కడ లారీ లేదని, అపహరణకు గురైందన్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి సహకారం అభినందనీయం

- స్థల దాతలు స్ఫూర్తి ప్రదాతలు... ప్రజలు ఎన్నటికీ మరువరు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



దొంతిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, తిరుపాలమ్మ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి



బుగ్గన సుదర్శన్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించిన దృశ్యం

డోన్ : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు దాతలు అందజేస్తున్న సహకారం అభినందనీయమని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సచివాలయ, ఆర్బీకే, హెల్త్ సెంటర్ తదితర భవనాల నిర్మాణాలకు దాతలు విలువైన స్థలాన్ని అందజేస్తున్నారని, వీరి సాయాన్ని ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. మండల పరిధిలోని మేజర్ పంచాయతీ చిన్న మల్కాపురంలో రూ.2కోట్లతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలను ఆదివారం మంత్రి ప్రారంభించారు. సచివాలయం, ఆర్బీకే భవన నిర్మాణాలకు విలువైన ఎకర స్థలాన్ని విరాళంగా అందజేసిన దివంగత బుగ్గన సుదర్శనరెడ్డి, దివంగత సునీల్ కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వారి విగ్రహాలను ఆవిష్కరించారు. గతంలోనూ దివంగత బుగ్గన సుదర్శనరెడ్డి ఎకర స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరో ఎకరంలో శివాలయం నిర్మించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అదేవిధంగా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసిన దొంతిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, తిరుపాలమ్మ విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. గతంలో దివంగత దొంతిరెడ్డి రెండెన్నర ఎకల్లో హైస్కూల్, అర్ధ ఎకారలో ఎలిమెంటరీ స్కూల్, గ్రామంలో రామాలయం, శివాలయం, కార్మికులకు గృహాలు నిర్మించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. విలువైన స్థలాలను విరాళంగా అందజేసిన దాతలు స్ఫూర్తి ప్రదాతలని ఈ సందర్భంగా కొనియాడారు. అదేవిధంగా దొంతిరెడ్డి సుబ్బారెడ్డి, బుగ్గన సుదర్శన్‌రెడ్డి వారసులైన దొంతిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకట సుబ్బమ్మ, దొంతిరెడ్డి లీలావతి, సురేంద్రారెడ్డి, మల్లేశ్వరి, నాగ భవానీ, మహానందిరెడ్డి, బుగ్గన రాజేశ్వర్ రెడ్డి శంకరరెడ్డిని మంత్రి ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం స్థానిక పీఎచ్‌సీని మంత్రి సందర్శించారు. డాక్టర్లతో ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించారు. సౌకర్యాలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వివిధ పరికరాలు కావాలని డాక్టర్లు విన్నవించగా త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చిన్నమల్కాపురం అభివృద్ధికి సహకరించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ గజ మాలతో సత్కరించారు.

ప్రచార రథాన్ని ప్రారంభించిన మంత్రి



ప్రచార ప్రగతి రథాన్ని ప్రారంభించిన మంత్రి

చిన్నమల్కాపురం పర్యటనకు ముందు ఉదయం డోన్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై ఛాయా చిత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని మంత్రి బుగ్గన స్వగృహం వద్ద ప్రారంభించారు. ప్రగతి రథం పేరుతో ప్రతి గ్రామంలో నియోజక వర్గ అభివృద్ధిని వీడియోల ద్వారా తెలియజేయాలని ఈ సందర్భంగా మంత్రి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ప్రతిఒక్కరికీ అర్థమయ్యే వివరించాలన్నారు. గ్రామ ప్రజలనందరినీ ఒక చోటికి చేర్చి కళా ప్రదర్శనలు గుర్తుకు తెచ్చే పాత రోజులు గుర్తుకు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల భాస్కర్ రెడ్డి, మహానంది రెడ్డి, బద్దల నాగరాజు, మోకు మద్దయ్య, నాగ మద్దయ్య, చాట్ల చిన్న మద్దయ, రఘురామయ్య, వెంకట సుబ్బారెడ్డి, సుబ్బయ్య, బాల మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలోని విద్యుత్ సరఫర వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, ఎగ్గోని, కానాల, అక్కం పల్లె, గిద్దలూరు,లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె మంగపల్లె, ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 1 గంటల వరకు, పేరుసోముల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో 5 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అంకితభావంతో పాటుపడాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకులోని చల్లా కార్యాలయంలో ఆదివారం కొండమీది గ్రామాల ఎంపీటీసీ, సర్పంచ్‌లతో ఎంపీపీ సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొండమీది గ్రామాలైన ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె, పిక్కలపల్లితాండా, మారేమడుగుల గ్రామాల అభివృద్ధికి తమ అన్నగారైన దివంగత నేత చల్లా రామ క్రిష్ణారెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మరణ అనంతరం దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి తనంతు కొండమీది గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా శ్రమించారని గుర్తు చేశారు. దివంగత చల్లా నేతృత్వంలో దాదాపు నలభై ఏళ్లుగా ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మా సోదరుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పారన్నారు. గ్రామాల్లో కుల,మత, వర్గ తేడాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. మనం పుట్టి పెరిగిన గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం మన బాధ్యతని, కలిసి కట్టుగా శ్రమిస్తేనే సాధ్యపడుతుందని చెప్పారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిని నమ్మొద్దని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమ కుటుంబానికి ఎంతో మేలు చేశారని, ఆయన చేసిన మేలుకు తమ కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో గెలిపించేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమ్లా నాయక్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, భూపాల్ రెడ్డి, కోనేటి సుబ్బమ్మ పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలపెంటలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీతో పాటు ఊరి వాకిలి వద్ద రూ.52 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అన్నీ అందుతున్నాయా.. ఆరా తీసిన ఎమ్మెల్యే ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. తదనంతరం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు నియోజకవర్గంలో వంద కోట్లతో జల్‌జీవన్ పనులు చేపడుతున్నామని గుర్తు చేశారు. ఎన్నో రకాల అభివృద్ధి పనులు నియోజవర్గ వ్యాప్తంగా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నా టీడీపీ నాయకులు, ఎల్లో మీడియాకు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. ఎక్కడా అభివృద్ధి జరగలేదని ప్రజలను తప్పు దోవ పట్టించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రజలకు చేసిన సేవలు, అభివృద్ధిని వివరించడంతోపాటు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తెలుసుకునేందుకు మీ ముందుకు వచ్చామన్నారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యత మేరకు పరిష్కార చర్యలు అప్పటికప్పుడే చేపడుతున్నామని వివరించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో గుర్తుండే పోయే ఏఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. పింఛన్ కావాలన్నా కమీషన్‌లు తీసుకొని మంజూరు చేసిన నీచమైన చరిత్ర టీడీపీ నాయకులదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఎవరితో పని లేకుండా నేరుగా అందిస్తున్నామని చెప్పారు. 2024 ఎన్నికల్లో మరో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఇంతకంటే జనరంజకమైన పాలన వస్తుందని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెస్తమల్లేశ్వరి, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, గ్రామ నాయకులు తోట మల్లేశ్వరెడ్డి, బాలదస్తగిరిరెడ్డి, యాతం పెద్దిరెడ్డి, లక్ష్మిరెడ్డి, తోట శివలింగారెడ్డి, తోట ఉప సర్పంచ్ తోట శివ శంకర్‌రెడ్డి, రామాంజనేయులు, రాము, ఆదిరంగారెడ్డి, వెంకటసుబ్బయ్య, మల్లికార్జునరెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, తోటశివరామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : మండల వ్యాప్తంగా రెండు రోజులపాటు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉండి ఓటరు నమోదు దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ మేరకు బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటరిన్నింగ్ అధికారి కామేశ్వరరావు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపీపీ కస్బా పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన అభ్యంతరాలు కూడా స్వీకరించి పరిశీలించాలని ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు కామేశ్వరరావు సూచించారు. డిసెంబరు 9వ తేది వరకూ ఓటర్ల జాబితాలో పేర్లు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉందని, ఈ విషయాన్ని ఓటర్లుకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు గోపాల్, ఈశ్వర్‌రెడ్డి, సురేంద్ర, సచివాలయ సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేంద్ర, జూనియర్ అసిస్టెంట్ మదర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంతో పాటు ఆయా గ్రామాలోని 86 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారులు ఆదివారం నిర్వహించారు. పట్టణంతో పాటు కొలుములపల్లె గ్రామంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు అందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

8న విద్యాసంస్థల బంద్

బేతంచెర్ల: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బంద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మధు శేఖర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకోసం 32 మంది ప్రాణత్యాగం చేశారని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు.

శరవేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు



ముక్కమల్లలో 90వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ ట్యాంక్



40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న సంపు, పంపు హౌస్

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంక్, వాటర్ సంపు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ గ్రామప్రజల తాగునీటి సమస్యను గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో శాశ్వత నీటి పరిష్కారానికి ఎమ్మెల్యే కాటసాని రెడ్డి ప్రత్యేక చొరువ తీసుకున్నారు. జల్‌జీవన్ పథకం కింద 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఆర్ నిర్మాణానికి రూ.63.39 లక్షలు,40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ సంపు, పంపు హౌస్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజురు చేయించారు. ఈ మేరకు చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయి. శాశ్వతంగా నీటి పరిష్కారానికి ప్రత్యేక చొరువ చూపిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రచార విభాగ జోనల్ ఇంచార్జ్ పోచ శీలా రెడ్డికి ముక్కమల్ల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నెల రోజుల్లో ఈ ట్యాంక్,సంపు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి తెలిపారు.

నేడు అంకిరెడ్డిపల్లెలో హెల్త్ క్యాంప్

కొలిమిగుండ్ల: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారంతో ముగుస్తాయని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. చివరి రోజు అంకిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వైద్యులు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని, గ్రామస్తులు హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా రైల్వే స్టేషన్ సమీపాన పాణ్యానికి చెందిన హనుమంత్ పేపర్లు ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతునికి ఎవ్వరు లేకపోవడంతో స్థానికులు అంత్యక్రియలు నిర్వహించాలని ఆనలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరారు. విషాన్ని వన్నూర్ బాషా పోలీసుల దృష్టికి తీసుకెళ్లి సభ్యులతో కలిసి అనాథ మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆనలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు లక్ష్మీ రాఘవ, సద్దాం, వెంకటేశ్వర్లు, యూసుఫ్, అక్బర్, మా బాషా పాల్గొన్నారు.

రూ.9.70లక్షలతో ఐసీడీఎస్ భవన పునర్నిర్మాణం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో రూ.9.70లక్షలతో నిర్మించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవన పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ భవనం శిథిలావస్థకు చేరి విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉండేది. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేకంగా జెడ్పీ నిధులు రూ.9.70లక్షలు మంజూరు చేశారు. దీంతో ఈ భవన నిర్మాణం ఇటివలే పూర్తి అయింది. త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చే ప్రారంభించేందుకు చర్యలు తీసుకొనున్నట్లు పీఆర్ ఏఈ వెంకటరమణ తెలిపారు.



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

ఫాతెహాలు సమర్పించిన ఎమ్మెల్యే కాటసాని




ముస్లిం సోదరులతో కలిసి ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెలే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ క్రీడామైదాం ఆవరణంలో ఉన్న శ్రీదస్తగిరి స్వామి దర్గాను గ్యార్మీ పండుగ పురస్కరించుకొని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. దస్తగిరిస్వామికి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముస్లిం సోదరులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఆంధ్రబాషా, కూరగాయాల మహాబుబ్‌బాషా, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన యర్రగుడికి గ్రామానికి చెందిన పోతురాజు గంగరాజు(44) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. పోతురాజు గంగరాజు గతంలో విద్యుత్ షాక్‌కు గురికావడంతో కాలికి గాయం కారణంగా ఏపని చేయలేక పోయేవాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండేవాడు. పైగా పెళ్లీడుకు వచ్చిన పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక పోతున్నానని కొద్ది రోజుల నుంచి బెంగ పెట్టుకున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం శనగల విషగుళికలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



గురువులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులను ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2002-03 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయులకు పూలు చల్లుతూ పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. పాఠశాల వ్యవస్థాపకులు శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం హెచ్ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు కుమారి, సత్యమ్మ, రత్నమ్మ, మధు సూదన్, వెంకటరెడ్డి, వెంకట్రావు, రామశర్మ, ఆనంద్, వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాసులుకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ప్రసాద్, లింగమూర్తి, బండ రాముడు, మహేష్, గుంగుల నాగరాజు, ధనుంజయ, శ్రీను, అశోక్, నాగరాజు,హరి, మధు, శ్యామల, రమాదేవి, తులసి, ప్రసన్న, ఉష, స్వరూప పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మూడు రోజుల నుంచి మేఘావృతమై ఉండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఆదివారం సాయంత్రం కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. వరణదేవుడిపై భారం వేసి సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు విస్తారంగా పప్పుశనగ, జొన్న మినుమ, పెసర, తదితర పంటలు సాగు చేశారు. పైరు మొలక దశలో ఉండగా నెల రోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో ఆయా మండలాల్లో మోస్తరు వర్షం కురియడంతో రైతులు ఊరట చెందుతున్నారు.